సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



మబ్బులు కలవరపడి కమ్ముకున్నాయి.. మేఘాల రాగాలు మెండుగా సాగాయి.. చిటపట చినుకులు చిందులు వేశాయి .. తనివితీరగ కురిసి తరలాయి మేఘాలు. ఈ సుందర దృశ్యాలు విశాఖ వాకిట సందడి చేశాయి.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

భారీ బెల్లం వినాయకుడు



పారిశ్రామిక ప్రాంతంలో 75 అడుగుల బెల్లం వినాయకుడి విగ్రహం రూపుదిద్దుకుంటోంది.

-మల్కాపురం

న్యూస్‌రీల్

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



సిబ్బందికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పంపిణీ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.22.46 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న శివజ్యోతి సంఘం సభ్యులు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు, దేవస్థానం ఈవో శిరీష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 33 రోజులకు రూ.20.46 లక్షలు, 8.3 మిల్లీ గ్రాముల బంగారం , 177 మిల్లీగ్రాముల వెండి , 154 యూఎస్ డాలర్లు, 350 ఇంగ్లాండ్ పౌండ్స్, 14 సింగపూర్ డాలర్స్, యుఏఈ ధరమ్స్, 55, రూ.111 చెక్కు వచ్చినట్లు శిరీష తెలిపారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్. చోళన్, శివజ్యోతి, శ్రీవెంకటేశ్వరసేవా సంఘం సభ్యులు, తనిఖీ దారుడు టి.రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మెకాన్‌తో పోర్టు ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పోర్టు-మెకాన్ సంస్థల ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక సహకారం కోసం ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు మెకాన్ లిమిటెడ్ సంస్థతో విశాఖ పోర్టు ఒప్పందం కుదుర్చుకుంది. పోర్టు పరిపాలన భవనంలోని మంతన్ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పోర్టు చైర్మన్ డా. ఎం. అంగముత్తు సమక్షంలో పోర్టు, మెకాన్ ప్రతినిధులు అంగీకార పత్రాలపై గురువారం సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా మెకాన్ సంస్థ పోర్ట్‌లో మౌలిక వసతులు మరింత మెరుగుపరచడం, బొగ్గు, ఖనిజాలు, ఇతర సరుకుల నిర్వహణ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించడానికి అనువైన పరిస్థితులను కల్పిస్తుంది.

మాల్డా టౌన్- సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: మాల్డాటౌన్-సికింద్రాబాద్ మధ్య వయా దువ్వాడ మీదుగా స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మాల్డా టౌన్-సికింద్రాబాద్ (03430) స్పెషల్ అక్టోబరు 10 నుంచి నవంబరు 26వ తేదీ వరకు, సికింద్రాబాద్-మాల్డా టౌన్ (03429) స్పెషల్ అక్టోబరు 10 నుంచి నవంబర్ 28 వరకు నడుస్తాయి.

నేడు వందేభారత్ రద్దు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్-విశాఖ-సికింద్రాబాద్ (20707/20708), విశాఖ-సికింద్రాబాద్-విశాఖ(20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను శుక్రవారం రద్దు చేసినట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు


నార్తర్న్ సెంట్రల్ రైల్వే పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 13న విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ (12803) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా బినా, రుథియాల్, సోగారియా, బయానా, మధుర జంక్షన్, పాల్వాల్ మీదుగా నడుస్తుంది. విశాఖ-అమృత్‌సర్(20807) ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా న్యూ కట్ని జంక్షన్, మణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, గోబింద్‌పూరి, తుండ్లా, ఘజియాబాద్, న్యూఢిల్లీ మీదుగా నడుస్తుంది.

• శుక్రవారం విశాఖ-హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, రాయగడ, టిట్లాఘడ్, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.

‘స్వదేశీ’ పర్యాటక వైభోగమే..!

- స్వదేశీ దర్శన్ 2.0లో ఉమ్మడి విశాఖకు పెద్దపీట
- రెండు ప్రాజెక్టులకు రూ.60 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- 2023 అక్టోబర్‌లోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రతిపాదనలకు అంగీకారం
- బొర్రాగుహలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం
- త్వరలోనే ఆంధ్రాకాశ్మీర్ లంబసింగికి రూ.30 కోట్లతో మహర్దశ
- అభివృద్ధి ప్రణాళికలు పంపిన వెంటనే రూ.30 కోట్లు కేటాయించనున్న కేంద్రం

సాక్షి, విశాఖపట్నం : ఒకవైపు ప్రకృతి వనరుల సిరిసంపదలు.. మరోవైపు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక కేంద్రాలు. అంతర్జాతీయ యాత్రికుల్ని అబ్బురపరిచే పర్యాటక కేంద్రాల సోయగాలు. దట్టమైన అడవులు. కొండా కోనలు.. మన్యాలు.. ఇదీ ఉమ్మడి విశాఖపట్నం పర్యాటక వైభవం. లెక్కకు మించిన ప్రకృతి సంపద సొంతమైన ఈ ప్రాంతంలో స్వదేశీ దర్శన్ 2.0.. కొత్త వైభోగాన్ని అందించనుంది. ఆంధ్రా కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగితో పాటు.. సహజసిద్ధమైన బొర్రా గుహలకు రూ.60 కోట్లతో అంతర్జాతీయ సొబగులు సంతరించుకుంటున్నాయి. అరకు, బొర్రాగుహలు,పాడేరు, లంబసింగి, సీలేరు ఇలా విశాఖ మన్యంలోని ప్రాంతాలు ఒకదానికి మించి ఒకటి హొయలుపోతూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక శాఖ సమాయత్తమవుతోంది. దేశంలో థీమ్ బేస్డ్ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేసేందుకు 2014-15లో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించి పలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసింది. 2019 తర్వాత స్వదేశీ దర్శన్ 2.0 పేరుతో సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టింది.



బొర్రా వద్ద అభివృద్ధి చెయ్యనున్న పార్కింగ్, ఫుడ్‌కోర్టు నమూనా

సున్నా డిగ్రీల లంబసింగి

మన్యంలో అరుకులోయకు దీటుగా పర్యాటకులను ఆకట్టుకోవడానికి ఆంధ్రా కాశ్మీర్ లంబసింగి పోటీపడుతోంది. విశాఖ నగరం నుంచి 135 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. తూర్పు కనుమల్లో సముద్రమట్టానికి వెయ్యి మీటర్లు (సుమారు 3 వేల అడుగుల) ఎత్తున లంబసింగి ప్రాంతం ఉంది. అందుకే శీతాకాలం ప్రారంభం నుంచే ఇక్కడ చలి మొదలవుతుంది. నవంబరు నుంచి జనవరి నెల వరకూ 0 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకూ అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవ్వడం ఇక్కడి విశేషం. కాఫీ, మిరియాల తోటలు, ఇక ఎదురుగా పచ్చని మైదానాలు, నోరూరించే స్ట్రాబెర్రీ మొక్కలు.. ఇవన్నీ వారిని కట్టిపడేస్తాయి. లంబసింగి సమీపంలో కొండలపై ఇటీవల ట్రెక్కింగ్ కూడా నిర్వహిస్తున్నారు. సమీపంలోని తాజంగి జలాశయంపై జిప్‌లైన్ ఏర్పాటు, జలాశయానికి ఇరువైపులా ఉన్న కొండల మధ్య రోప్, జలాశయంలో బోటింగ్.. ఇలా భిన్నమైన ప్రాజెక్టులతో లంబసింగి కళకళలాడనుంది. దీనికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించేందుకు జిల్లా టూరిజం అధికారులు సిద్ధమవుతున్నారు. లంబసింగి అభివృద్ధికి రూ.30 కోట్లు కేటాయించనున్నట్లు కేంద్రం ప్రకటించింది.



లంబసింగి

సహజ గుహలకు సొబగులు

అరకు అందాలకు.. బొర్రా గుహలు ప్రత్యేక ఆకర్షణ. సినీ ప్రపంచానికి ఎంతో ఇష్టమైన బొర్రా గుహల్ని సందర్శించేందుకు ఏటా లక్షల మంది వస్తుంటారు. ఈ సంఖ్యను రెట్టింపు చేసేందుకు అనుగుణంగా స్వదేశీ దర్శన్ 2.0 చేయూతనందిస్తోంది. సహజ సిద్ధంగా ఏర్పడిన బొర్రా గుహల అభివృద్ధికి రూ.29.87 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి పర్యాటక శాఖ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు(ఆర్‌ఎఫ్‌పీ) ఆహ్వానించింది. గుహల బయట, లోపల రెండు భాగాలుగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. బొర్రా బయట.. ఎలక్ట్రిక్ వాహనాలు చార్జింగ్ స్టేషన్లు, పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తారు. మార్కెట్ ప్రాంతంలో ఆకర్షణీయమైన వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్టులు, గుహల ముందు పర్యాటకులు కూర్చొని సేదతీరుతూ.. బొర్రా అందాల్ని వీక్షించే ఏర్పాట్లు, కేఫ్‌టేరియా, మరుగుదొడ్లు, రెస్ట్‌రూమ్‌లు, సమాచార కేంద్రం, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లాకర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా.. గుహల లోపల.. మెట్ల మార్గాల అభివృద్ధి, ఫ్లోరింగ్, గుహల్లో దిగుతున్నప్పుడు ప్రమాదాలు జరగకుండా రెయిలింగ్, ఆకర్షణీయమైన క్యూరేటెడ్ లైటింగ్, సౌండింగ్ మొదలైన ఏర్పాట్లు రాబోతున్నాయి.



గుహల్లోకి వెళ్లేందుకు వాకింగ్ ట్రాక్

గత ప్రభుత్వ హయాంలోనే...

స్వదేశీ దర్శన్ 2.0 లో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ ప్రాంతాలను అభివృద్ధి చెయ్యాలని కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంతో పాటు ఏజెన్సీలోని ప్రపంచ పర్యాటక కేంద్రాలుగా పేరొందిన బొర్రా గుహలు, లంబసింగి ప్రాంతాలపై దృష్టిసారించాలని కోరింది. దీనిపై స్పందించిన కేంద్రం ప్రసాద్ పథకంలో రూ.54.04 కోట్లతో సింహాచలం అభివృద్ధి చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా బొర్రా గుహలు, లంబసింగి ప్రాంతాల్లో ప్రపంచ స్థాయి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని 2023 అక్టోబర్‌లో సూచించింది. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రతిపాదనలు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు పంపించడం ఆలస్యమైంది. ఇటీవల కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడంతో బొర్రా గుహలు, లంబసింగి అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం ఓకే చెప్పింది.

విభిన్నంగా పర్యాటకాభివృద్ధి



జిల్లాకు వచ్చే పర్యాటకుల్లో 80 శాతం మంది అరకు మొదలైన ఏజెన్సీ ప్రాంతాల్లోనూ పర్యాటక స్థలాలను సందర్శిస్తుంటారు. అలాంటి మన్యం అందాలకు మెరుగులు దిద్దేందుకు సుమారు రూ.60 కోట్లతో లంబసింగి, బొర్రా గుహల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నాం. త్వరలోనే ఆర్‌ఎఫ్‌పీ టెండర్లు ఖరారు చేయనున్నాం. తర్వాత టూరిస్ట్ ఎక్స్‌పీరియన్స్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అథారిటీ(టీఈడీఎంఏ)కి సమగ్ర నివేదికలు పంపించి.. అక్కడ నుంచి ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ రెండు ప్రాంతాల్ని బేస్ చేసుకొని భవిష్యత్తులో అనేక కొత్త టూరిజం ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– శ్రీనివాస్ పాణి,
పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

సమాజ నిర్మాణంలో గురువులే కీలకం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో డీఈవో చంద్రకళ

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- 80 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసిన కలెక్టర్

ఎంవీపీకాలనీ: సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా వేడుకలు జరిగాయి. తొలుత హరివెంకట కుమారి, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ చిరంజీవి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రతి మనిషి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దే శక్తి చదువుకు ఉందన్నారు. అనంతరం అతిథులంతా కలిసి ఈ ఏడాది జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆచార్యులను సత్కరించారు. జిల్లాలో 80 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ హరిందిర ప్రసాద్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ, టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



అంధ ఉపాధ్యాయిని ఎంఎల్ఎస్ కాంతంను సత్కరిస్తున్న అతిథులు

సింగిల్ విండో తూచ్..

- వినాయక మండపాల నిర్వాహకులకు చుక్కలు
- అమలు కాని హోం మంత్రి అనిత ప్రకటన
- ప్రచార ఆర్భాటం కోసమే ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ అని విమర్శలు

విశాఖ సిటీ: సింగిల్ విండో విధానంలో వినాయక మండపాలకు అనుమతులు ఇచ్చేస్తున్నామని ఊదరగొట్టారు. ఇందుకోసం ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ ప్రారంభోత్సవం పేరుతో ప్రచార ఆర్భాటాలు చేశారు. అది నిజమే అని నమ్మి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులకు ఇప్పుడు పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు.

అన్నీ అబద్ధాలే..

వినాయక చవితి ఉత్సవాల అనుమతులకు తొలిసారిగా సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు స్వయంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. ఇందుకోసం యాప్, వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో జీవీఎంసీ, ఫైర్, పోలీస్, ఈపీడీసీఎల్ ఇలా అన్ని శాఖల అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. అయితే ఆ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిని పోలీసులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. అన్ని శాఖల దగ్గరకు వెళ్లి అనుమతులు తీసుకున్న తరువాతే తాము ఫైనల్‌గా అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. సింగిల్ విండో విధానం అన్నారుగా అని ఎవరైనా ప్రశ్నిస్తే.. అలా ప్రభుత్వం చెప్పిందని, తమకు సంబంధం లేదని తెగేసి చెబుతుండడం గమనార్హం. ఇదిలా ఉంటే కొంత మంది సొంత స్థలంలో గణేష్ మండపాల ఏర్పాటుకు జీవీఎంసీ నుంచి అనుమతులు తెచ్చుకోవాలని పోలీసులు చెబుతుండడం విశేషం. వాస్తవానికి సొంత స్థలాల్లో, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్న ప్రాంతాల్లో ఆయా శాఖల నుంచి అనుమతులు అవసరం లేదు. అయినప్పటికీ పోలీసులు వాటి నుంచి అనుమతులు తీసుకురావాలని చెప్పడం.. జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు మాత్రం వాటికి తమ అనుమతులు అవసరం లేదని చెబుతుండడంతో నిర్వాహకులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



అనుమతుల కోసం అష్టకష్టాలు

సింగిల్ విండో విధానం అని చెప్పి అన్ని శాఖలకు తిప్పుతున్న పోలీసులపై నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని అనుమతులు సులువుగా వచ్చేస్తాయని భావించిన అనేక మంది వినాయక చవితి సమీపిస్తున్న తరుణంలో దరఖాస్తులు చేసుకున్నారు. పోలీసులు వీరికి ఫోన్లు చేసి సంబంధిత కార్యాలయాలకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాలని చెబుతుండడంతో వారు ఒకవైపు మండపాల పనులతోను, మరోవైపు అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అష్టకష్టాలు పడుతున్నారు.

రామన్న చెరువులో వ్యక్తి అనుమానాస్పద మృతి



కోటేశ్వరరావు మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న స్నేహితులు



కోటేశ్వరరావు (ఫైల్)

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరం నుంచి శొంఠ్యాంనకు వెళ్లే రహదారిలో ఏఎంజీ వ్యాలీ వద్ద ఉన్న రామన్న చెరువులో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. గురువారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. మంగవిల్లి వెంకట కోటేశ్వరరావు(32) గోపాలపట్నంలోని వైశ్యరాజు జ్యూయలర్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అడవివరంలోని ప్రియాగార్డెన్స్‌లో తండ్రి అప్పలరాజు, తల్లి అరుణతో కలిసి నివాసం ఉంటున్నాడు. అప్పలరాజుకి సింహాచలం కొండపై బొమ్మలు, ఫొటోలు తదితర వస్తువుల విక్రయాల దుకాణం ఉంది. కాగా.. కోటేశ్వరరావు ఈ నెల 4వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రానికి ఇంటికి రాకపోయే సరికి బంధువులు, స్నేహితులు అతని ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఏఎంజీ వ్యాలీకి సమీపంలో గురువారం ఉదయం కోటేశ్వరరావు బైక్ కనిపించింది. సమీపంలో ఉన్న రామన్న చెరువు దగ్గరకి వెళ్లి చూడగా.. అందులో కోటేశ్వరరావు మృతదేహం సగం వరకు మునిగి ఉండటం గమనించారు. వెంటనే గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లా అండ్ ఆర్డర్ ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. కోటేశ్వరరావు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కాగా కోటేశ్వరరావుది హత్యా.. ఆత్మహత్య అనే కోణం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అతను ఎప్పుడూ రామన్న చెరువు వైపు వెళ్లిన దాఖలాలు లేవని స్నేహితులు చెబుతున్నారు. సగం వరకు మాత్రమే మృతదేహం మునిగి ఉండటంపై వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



పేర్ల విజయ చందర్



పిల్లి సుజాత



పోతిన శ్రీనివాసరావు



ఎస్ఎస్‌కే మహంతి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. విశాఖ నుంచి రాష్ట్ర మత్స్యకార విభాగం అధ్యక్షుడిగా పేర్ల విజయ చందర్, యాత విభాగం అధ్యక్షురాలిగా పిల్లా సుజాత, నగరాలు విభాగం అధ్యక్షుడిగా పోతిన శ్రీనివాసరావు, రాష్ట్ర శిష్టకరణాల అనుబంధ విభాగం అధ్యక్షుడిగా ఎస్ఎస్‌కే మహంతిని నియమించారు. గురువారం ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

డేటా ఎంట్రీ జాబ్స్ పేరుతో మోసం

- నిరుద్యోగుల నుంచి భారీగా వసూళ్లు
- ముగ్గురి అరెస్ట్.. పరారీలో ఏడుగురు

విశాఖ సిటీ: డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఠాను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఏఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కంపెనీ అనే సంస్థ పేరుతో భవన సైనీ, థిల్లన్ రేష్మమ్ సింగ్, బానోత్ సావిత్రి మరికొంత మంది కలసి ముఠాగా ఏర్పడ్డారు. ఆగస్టు 8న రామ్‌నగర్ ప్రాంతంలోని రేగస్ బిజినెస్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ.15 వేల నుంచి రూ.25 వేలు జీతాలు ఇస్తామని నమ్మించారు. సుమారు 60 మంది నుంచి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.3,500 నుంచి రూ.4,500 చొప్పున వసూలు చేశారు. అనంతరం నెల గడిచినా జీతాలు ఇవ్వలేదు. దీంతో అనుమానం వచ్చిన కొంత మంది రేగస్ బిజినెస్ సెంటర్‌లో కార్యాలయానికి వెళ్లి చూడగా.. కంపెనీని మూసేసినట్లు గుర్తించారు. దీంతో 20 మంది బాధితులు ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఇదే వ్యక్తులు విజయవాడలో ఇంపాక్ట్ సొల్యూషన్స్ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి భవన సైనీ, థిల్లన్ రేష్మమ్ సింగ్, బానోత్ సావిత్రిలను అరెస్టు చేశారు. వారిని విచారించగా ఢిల్లీకి చెందిన అమిత్‌కుమార్ శర్మ తన భార్య సోనియా సంజనా శర్మ పేరు మీద ఏఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి, వారి కంపెనీ ప్రతినిధులుగా 10 మందిని నియమించుకున్నట్లు తెలుసుకున్నారు. వీరు ఇప్పటి వరకు హైదరాబాద్, విశాఖ, విజయవాడలో ఇదే తరహాలో నిరుద్యోగులను మోసం చేసినట్లు గుర్తించారు. పరారీలో ఉన్న ఏడుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

తప్పుడు పత్రాలతో భూ విక్రయం

- రూ.1.20 కోట్లు కాజేసిన ఘనులు
- సీపీని ఆశ్రయించిన బాధితుడు
- 10 మందిపై కేసు నమోదు

పెందుర్తి: తప్పుడు పత్రాలు సృష్టించారు. వేరొకరి భూమిని తమ భూమిగా చూపించారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని రూ.1.20 కోట్లు కాజేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు ఫిర్యాదు అందడంతో 10 మందిపై కేసు నమోదైంది. వివరాలివీ.. జీవీఎంసీ 88వ వార్డు గవర జగ్గయ్యపాలేనికి చెందిన కాండ్రేగుల సత్యనారాయణ, తనకాల చలపతిరావు కలిసి నూకాంబిక కన్‌స్ట్రక్షన్స్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. 2019లో శాతవాహన కోఆపరేటివ్ సొసైటీకి చెందిన భూమి తమ వద్ద ఉందని చెప్పి దొడ్డి సూర్యారావు, మారిశెట్టి పెద్ద మల్లెపూవు, మరికొందరు వ్యక్తులు సత్యనారాయణ, చలపతిరావును కలిశారు. సతివానిపాలెం సర్వే నంబర్ 325/1, 2లలో 8.73 ఎకరాల సొసైటీ భూమి ఉందని.. ఆ భూమికి రూ.1.20 కోట్లు చెల్లిస్తే కోర్టు ద్వారా సొంతం అయిపోతుందని, సొసైటీ ప్రతినిధులే జీపీఏ చేయిస్తారని నమ్మబలికారు. ఆ భూమిని 40:60 వాటాలుగా పంచుకోవచ్చని నమ్మించారు. దీంతో కాండ్రేగుల సత్యనారాయణ, తనకాల చలపతిరావు తమ ఖాతాల్లోని నగదు రూ.1.20 కోట్లను దొడ్డి సూర్యారావు ఖాతాకు బదిలీ చేశారు. అనంతరం తప్పుడు డాక్యుమెంట్లతో గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ముందస్తు ఒప్పందం ప్రకారం సత్యనారాయణ, చలపతిరావుకు 3.20 ఎకరాల భూమి వచ్చింది. ఆ స్థలంలో లేఅవుట్ వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూమి తమదంటూ మరో వ్యక్తి రావడంతో కథ అడ్డం తిరిగింది. తాము మోసపోయామని గుర్తించిన సత్యనారాయణ నగర పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించాడు. ప్రాథమిక సాక్ష్యాల ఆధారంగా ప్రీ లిటిగేషన్ ఫోరం ద్వారా కేసు నమోదు చేయాలని పెందుర్తి సీఐ రామకృష్ణకు సీపీ ఆదేశాలు జారీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులు దొడ్డి సూర్యారావు, కర్రి గణేశ్వరరావు, మారిశెట్టి పెద్ద మల్లెపూవు, శరగడం నాగ అప్పారావు, ఎ.గణేష్, పి.సూర్యనారాయణ, పిల్లా సత్యనారాయణ, ఎస్.సన్యాసిరావు, టి.శ్రీనివాస్, ఎం.ఎస్ పెంటయ్యనాయుడుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

వరద బాధితులకు విరివిగా సాయం

మహారాణిపేట/విశాఖ సిటీ : విజయవాడ వరద బాధితులకు అధికార యంత్రాంగం, పలు స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సాయం చేస్తున్నాయి. వాల్తేర్ క్లబ్ సభ్యులు, ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని వివిధ విద్యా సంస్థలు, ఇతర సంస్థలు కలిసి రూ.21,87,116 విరాళం ప్రకటించాయి. ఇందులో ఐబీపీ సెంచరీ క్లబ్ రూ.10 లక్షలు, వాల్తేరు క్లబ్ రూ.10 లక్షలు, లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.2లక్షలు అందజేసింది. ఈ మొత్తం చెక్కులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌కు ఎంపీ శ్రీ భరత్ అందజేశారు. అలాగే వీఎంఆర్డీఏ వీఎంఆర్డీఏ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వీకేపీసీపీఐఆర్ ఉద్యోగులు ఒక రోజు బేసిక్ పేను సీఎం సహాయనిధికి విరాళంగా అందజేశారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ చేతుల మీదుగా రూ.6.76 లక్షలు పంపించారు.



మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్‌కు చెక్కు అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

పర్యాటక భూములకు రక్షణ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతాల్లో ఉన్న పర్యాటక భూములకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి తెలిపారు. గురువారం జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ, కాపులుప్పాడ గ్రామాల్లోని పర్యాటక భూముల్లో ఆమె పర్యటించారు. తొట్లకొండ ఎదురుగా గల బేవాచ్ పార్క్‌లోని స్థలం, చేపలుప్పాడ పరిధి కొత్తూరులోని పర్యాటక స్థలాన్ని పరిశీలించారు.